టెట్ పరీక్షకు 340 మంది గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 349 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కర్నూలు జిల్లాలో శనివారం జరిగిన టెట్ పరీక్షకు మొత్తం 2192 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 1852 మంది హాజరు కాగా, 340 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 1410 మందికి గాను 1172 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 238 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 782 మంది మందికి గాను 680 మంది హాజరు కాగా 102 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, డిపార్టుమెంట్ ఆఫీసర్లు తనిఖీ చేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నవంబరు 10 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకం గా జరుగుతుందని, దరఖాస్తు చేసుకున్న అభ్య ర్థులు దళారులను నమ్మి మోసపోవద్దని గుంటూరు ఆర్మీ నియామక కార్యాలయం డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమా ర్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అగ్నివీర్ జన రల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ నియామకాలకు సంబంధించిన ఆర్మీ రిక్రూట్‌మెం టు ప్రక్రియ నవంబరు 10 నుంచి 15 వరకు కడప డీఎస్‌ఏ స్టేడియంలో జరుగుతుందని ఇందులో ఇతర జిల్లాలతో పాటు కర్నూలు జిల్లాకు చెందిన అభ్య ర్థులు కూడా ఇందులో పాల్గొంటా రని అన్నారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని ఆర్మీ నియామక అధికారి తెలిపారు. అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించడానికి సహాయం చేస్తామని వచ్చే మోసగాళ్ల నుంచి దరఖాస్తుదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కష్టపడి న వారికి, మెరిట్ ప్రకారంగా ఎంపిక జరుగుతుందని, మధ్య దళారు లు, ఏజెంట్లను నమ్మవద్దని ఆయన సూచించారు. అలాగే ఏజెంట్లు, ఏజెన్సీల ఆకర్షణలో పడవద్దని ఆర్మీ నియామక అధికారి సూచించారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకొని పొందిన అడ్మిట్ కార్డులను www.joinindianarmy.nic.inలో అప్‌లోడు చేసిన 12 ఫిబ్రవరి 2024 నాటి నోటిఫికేషన్ ప్రకారం ర్యాలీ సైట్‌కు సంబంధించిన అన్ని పత్రాలు అభ్యర్థులు తప్పనిసరిగా తీసుకు రావాలని ఆయన తెలిపారు.

ఓటర్ల జాబితాపై కలెక్టర్ సమీక్ష



కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరి రివిజన్-2025 అంశంపై ఈఆర్వో, ఏఈఆర్వోలతో శనివారం కలెక్టర్ పి. రంజిత్ బాషా టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ (ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025)కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఈఆర్వో, ఏఈఆర్వోలను ఆదేశించారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి 625, ఆదోని అసెంబ్లీ నియోజకవర్గానికి 520, ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గానికి 375 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్‌కు సంబంధించి 19వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో పాణ్యం అసెంబ్లీ ఈఆర్వో, జాయింట్ కలెక్టర్ బి. నవ్య, ఆదోని సబ్ కలెక్టర్, ఆదోని అసెంబ్లీ ఈఆర్వో మౌర్యభరద్వాజ్, పత్తికొండ అసెంబ్లీ ఈఆర్వో భరత్ నాయక్, కోడుమూరు అసెంబ్లీ ఈఆర్వో సందీప్ కుమార్, ఎమ్మిగనూరు అసెంబ్లీ ఈఆర్వో నాసరరెడ్డి, మంత్రాలయం అసెంబ్లీ ఈఆర్వో విశ్వనాథ్, ఆలూరు అసెంబ్లీ ఈఆర్వో రాము నాయక్, డీఆర్వో చిరంజీవి, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

పెరిగిన ఉల్లి ధర

క్వింటా రూ.4,329



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నా ధరలు ఆశాజనకంగా పెరుగుతుండటంతో ఊరట చెందుతున్నారు. శనివారం కర్నూలు మార్కెట్ యార్డుకు వివిధ ప్రాంతాల నుంచి 4,643 క్వింటాళ్ల ఉల్లిని రైతులు విక్రయానికి తెచ్చారు. వారం క్వింటానికి గరిష్ఠంగా నాలుగు వేలు మాత్రమే చేతికి అందింది. శనివారం గరిష్ఠంగా రూ.4,329, మధ్యస్థ ధర రూ.3,591, కనిష్ఠ ధర రూ.495 అందడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఎండుమిరప కాయలకు కూడా మంచి ధర లభిస్తుంది. క్వింటానికి గరిష్ఠ ధర రూ.9,229, మధ్యస్థ ధర రూ.8,613, కనిష్ఠ ధర రూ.3,629 రైతులకు అందినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు.

ఉన్నది ఒక్కటే జిమ్‌దగీ..!



స్త్రీలు తమ జీవితంలో ప్రతి దశలోనూ విభిన్న రకాల మార్పులు ఎదుర్కొంటూ ఉంటారు. వీటి కారణంగా వారి ఫిట్‌నెస్ దెబ్బతింటుంది. ముఖ్యంగా ఇప్పట్లో అమ్మాయిలు ఒక వైపు ఇంటి పనులు చేసుకుంటూ మరో వైపు ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. దీనివల్ల తొందరగా అలసిపోతారు. మగవారితో పోలిస్తే అమ్మాయిల్లో హార్మోన్ల అసమతుల్యత ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా ఉండాలన్నా, మహిళలు తమ ఫిట్‌నెస్ విషయంలో ఎలాంటి చీకు చింతా ఎదుర్కోకూడదన్నా వారి శరీరంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలి. శరీరాన్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే వ్యాయామం చేయాల్సిందే. ప్రస్తుతం ఎక్కువ మంది ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిమ్‌లను ఆశ్రయిస్తున్నారు. శారీరక ధృఢత్వం, ఆరోగ్యం కోసం వ్యాయామం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల శారీరకంగానే కాదు మానసికంగా ధృడంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

6లో..

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం

ఎస్పీ జి. బిందుమాధవ్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనం అవుతాయని ఎస్పీ బిందుమాధవ్ వైద్య విద్యార్థులకు సూచించారు. శనివారం కర్నూలు మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అధ్యక్షతన ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్ పేరుతో సీనియర్లు వేధించకూడదన్నారు. హనీట్రాప్, బెదిరింపు ఫోన్‌కాల్స్, లోన్లు, డ్రగ్స్ వీటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో యాప్‌ల ద్వారా లోన్లు తీసుకుని ఇబ్బందులు పడవద్దని హెచ్చరించారు. ర్యాగింగ్ జరిగినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యక్తుల గౌరవం, ప్రతిష్ఠను భంగం కలిగించేలా వ్యవహరించడం చట్టప్రకారం నేరమన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఐదేళ్లు బాధ్యతగా ఉండాలని ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ర్యాగింగ్ చిన్నదైనా అందులో సెక్షన్లు, శిక్షలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, వైద్యులు సాయిసుధీర్, రేణుకాదేవి, విజయానందబాబు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్ మనోహర్, హాస్టల్ ఫ్ వార్డెన్లు మాదవీ శ్యామల, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీశైల జలాశయం నాలుగు గేట్ల ఎత్తివేత



నాలుగు గేట్ల ద్వారా దిగువకు ప్రవహిస్తున్న వరద

శ్రీశైలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నీలం సంజీవరెడ్డి శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం భారీగా కొనసాగుతోంది. జలాశయానికి వరద భారీగా కొనసాగుతుండడంతో శనివారం డ్యాం అధికారులు 4 క్రస్టుగేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జున సాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,18,464 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 72,114 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 మొత్తం 1,90,828 వరద నీరు వస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమాయానికి 1,25,641 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వచ్చి చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 213.8824 టీఎంసీలుగా నమోదైంది.

కేంద్ర దర్యాప్తు సంస్థ పేరుతో బెదిరింపులు

కర్నూలులో నకిలీ అధికారుల గుర్తింపు

వివరాలు 7లో



కోడలిని హతమార్చిన మామ అరెస్టు

7

రాయలసీమ వర్సిటీ ప్రొఫెసర్‌కు మెమో

ఎమ్మెల్యే అనుచరుడి భూ కబ్జా

- రూ.1.50 కోట్ల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

7

ఎవరి లెక్క వారిదే

- ఇంతకూ కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీలు ఎన్ని?
- నోటిఫికేషన్‌లో 52.. జిల్లా అధికారులు భర్తీ చేస్తున్నది 49
- ఆందోళనలో అభ్యర్థులు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీఈవో శామ్యూల్

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల నియామకాల్లో గందరగోళం నెలకొంది. రాష్ట్ర అధికారుల నోటిఫికేషన్‌లోని ఖాళీల సంఖ్యకు జిల్లా అధికారులు భర్తీ చేస్తున్న పోస్టుల సంఖ్యకు పొంతన కుదరడం లేదు. నోటిఫికేషన్‌లో కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో పీఈటీ పోస్టు ఒకటి, పీఆర్టీలు 14, టీజీటీలు 15, పార్ట్ టైమ్ టీచర్స్ 16, వార్డెన్ పోస్టులు 6 మొత్తం 52 ఖాళీలను ప్రకటించారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు 1:20 ప్రకారం రోస్టర్ కం మెరిట్ తాత్కాలిక జాబితాను వెల్లడించారు. అయితే ఇందులో 49 పోస్టులను మాత్రమే జిల్లా సమగ్ర శిక్ష అధికారులు చూపిస్తున్నారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన ఖాళీల సంఖ్యకు జిల్లా స్థాయి అధికారులు చేపట్టిన నియామకాలకు పొంతన కుదరడం లేదు. నోటిఫికేషన్‌లో పీఈటీ పోస్టు ఒకటే ఉంది. ఇవి రెండు పోస్టులు ఉన్నట్లు అధికారులు చూపిస్తున్నారు. అలాగే పీఆర్టీ పోస్టులు 14 అని ప్రకటించారు. 16 పోస్టులు జిల్లా స్థాయిలో చూపిస్తున్నారు. నోటిఫికేషన్‌లో సోషల్ స్టడీస్, మ్యాథమాటిక్స్ పోస్టులను చూపించారు. అయితే ఈ పోస్టులకు నియామకాలను చేపట్టడం లేదు. నాన్‌టీచింగ్ కేటగిరి కింద ఏపీ మోడల్ స్కూల్‌లోని హాస్టళ్లలో 6 వార్డెన్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు నోటిఫికేషన్‌లో ప్రకటించారు. మద్దికెర పాఠశాలల్లోని స్పెషల్ ఆఫీసర్‌తో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులందరినీ విధుల నుంచి తొలగించారు. అయితే వార్డెన్ తనను ఉద్యోగంలో కొనసాగించాలని కలెక్టర్‌ను వేడుకొని అనుమతి పొందారు. ఈ వార్డెన్ పోస్టును కూడా ఖాళీలలో చూపించారు. ఈ పోస్టును తిరిగి భర్తీ చేస్తున్నట్లు నోటిఫికేషన్‌లో చూపించడంతో ఈ ఉద్యోగి హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. అలాగే ఎమ్మిగనూరులో కేజీబీవీలో పని చేస్తున్న స్పెషల్ ఆఫీసర్‌ను తొలగించారు. బాధితురాలు కోర్టును ఆశ్రయించి అనుకూలంగా ఉత్తర్వు తెచ్చుకున్నారు. అయినా ఈ పోస్టు ఖాళీగా ఉన్నట్లు నోటిఫికేషన్‌లో చూపించారు. జిల్లాలో ఎన్ని ఖాళీలు ఉన్నదీ కింది స్థాయి అధికారుల నుంచి సమాచారం తెలుసుకోకుండా రాష్ట్ర అధికారులు నోటిఫికేషన్‌లో 52 ఖాళీలు ఉన్నట్లు ప్రకటించడంతో ఈ గందళగోళం ఏర్పడిందనే అభిప్రాయం వినిపిస్తుంది. ఈ స్థితిపై అభ్యర్థులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలనకు నేటి వరకు గడువు

కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూళ్లలో ఉద్యోగాల నియామకాల కోసం అభ్యర్థుల సర్టిఫికెట్ల ఆన్‌లైన్ పరిశీలనకు ఆదివారం చివరిరోజు. జిల్లాలో మొత్తం 49 పోస్టులకు గాను 1953 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష ఏపీసీ శామ్యూల్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. పలువురు అభ్యర్థులు తమకు జరిగిన పొరపాట్లను వివరించారు. స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు అభ్యర్థులకు వివరించారు. ఉద్యోగాల నియామకాల భర్తీ ప్రక్రియ గందరగోళంగా జరగడంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

శ్రీశైలం ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖరరెడ్డి



శ్రీశైలం, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా ఇ.చంద్రశేఖరరెడ్డి శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. శ్రీశైలం దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్న డి. పెద్దిరాజును ఆయన మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీశైలం దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్ ఇ సత్యనారాయణకు ఇన్‌చార్జి ఈవోగా నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఉత్తర్వులను అనుసరించి శనివారం ఉదయం ఆలయ పరిపాలన భవనంలోని ఈవో చాంబర్‌లో ఇ. చంద్రశేఖరరెడ్డి శ్రీశైలం దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఆలయ సంప్రదాయాలను అనుసరించి ఆలయ అర్చకులు, వేదపండితులు చంద్రశేఖరరెడ్డికి వేదాశీర్వాదం పలికారు. అనంతరం దేవస్థానం అన్ని విభాగాల యూనిట్ అధికారులతో మాట్లాడుతూ రానున్న కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు.

రేపు కర్నూలులో ట్రాన్స్‌కో సమన్వయ సమితి సమావేశం

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కో రాష్ట్ర సమన్వయ సమితి సమావేశం కర్నూలులో ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి అధ్యక్షతన సోమవారం జరగనుంది. ఈ సమావేశంలో 2024-25 నుంచి 2028-29 వరకూ రాష్ట్ర విద్యుత్తు ప్రణాళిక ఆమోదం పొందేందుకు ఏర్పాటు చేసినట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు, ఏపీట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, డిస్కమ్‌ల సీఎండీలు పట్టన్‌శెట్టి రవి, ఇమ్మడి పృధ్వీతేజ్, సంతోష్‌రావు, ఎన్టీపీసీ, సెకీ తదితర సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారని వివరించారు.

నడక యాతన



మూగలదొడ్డి గ్రామంలో బురదను తప్పించుకుంటూ వెళ్తున్న తహసీల్దార్ నిత్యానందరాజు

కోసిగి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అడుగు తీసి అడుగు వేయాలంటే ఆలోచించాల్సిందే. తడబడ్డామంటే కాలి జారి బురదలో పడాల్సిందే. గ్రామాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారడమే ఇందుకు కారణం. కోసిగి మండలం మూగలదొడ్డి గ్రామంలో శనివారం పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. అధికారులు, టీడీపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొనడానికి బయలుదేరారు. గ్రామంలో వీధులన్నీ బురద మయం కావడంతో నడుచుకుంటూ వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ నిత్యానందరాజు, టీడీపీ నాయకులు అడుగులో అడుగులు వేస్తూ మెల్లిగా ముందుకు సాగాల్సి వచ్చింది.



మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు బానిసైతే భవిష్యత్తు నాశనమవుతుందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి అన్నారు. సమాజంలో మత్తు పదార్థాలు వాటి దుష్ప్రభావాలపై ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌వోడీ వైస్ ప్రిన్సిపాల్ డా. సాయిసుధీర్ ఆధ్వర్యంలో కేఎంసీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో జోనల్ సీఎంఈ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి, నీరు, నేల, కాలుష్యమైతే, దాని ప్రభావం మనిషిపై పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పృథ్వీ వెంకటేశ్వర్లు, రాయలసీమలోని సీనియర్ ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణుడు డా.శంకర్, డా. వీరనాగిరెడ్డి, డా. బ్రహ్మాజీ మాస్టర్, డా. బాబు, డా. ప్రభాకర్, డా. జగదీష్ నాయక్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



రాయలసీమ ఫ్లోరెన్సిక్ జోనల్ సీఎంఈలో పాల్గొన్న వైద్యులు

పత్తి పంటకు ఎర్ర తెగులు

గొర్రెల మేతకు వదిలేసిన రైతు

కోసిగి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటకు ఎర్ర తెగులు సోకింది. దీంతో ఓ రైతు పంటను పశువులకు వదిలేశాడు. మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి తన రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. వర్షాలకు పత్తి కాయలు కుళ్లి పోవడంతో శనివారం గొర్రెలు, మేకలు, ఆవుల మేతకు వదిలేశాడు. సుమారు రూ.60వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు రామిరెడ్డి కోరుతున్నాడు.


మేకలకు మేతగా వదిలేసిన పత్తి పంట

ఆదివారం ప్రత్యేకం
Sundayspecial

ఉన్నది ఒక్కటే జిమ్‌దగీ..!

- శరీరాకృతి కోసం మహిళల ఫీట్లు
- బరువు తగ్గేందుకు ప్రాధాన్యం
- ఆసక్తి కనబరుస్తున్న నగర మహిళలు, యువతులు






కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిమ్ గురించి అందరికి తెలుసు. వ్యాయామశాలలో వివిధ యంత్రాలతో పాటు గాడ్జెట్లను ఉపయోగించి వ్యాయామం చేస్తారు. ఫిట్, టోన్డ్ బాడీని పొందడానికి చాలా మంది జిమ్‌కు వెళ్తున్నారు. మహిళలు జిమ్‌కు వెళ్లి కార్డియో, కాళ్లు, వెయిల్ లిఫ్టింగ్ వంటి వివిధ వ్యాయామాలు చేస్తారు. క్రాస్ ఫిట్, జుంబా, కార్డియా వర్క్‌అవుట్ చేస్తున్నారు. ఎముకలు బలహీనంగా ఉండటంతో బలం కోసం పరికరాలు, రాడ్స్, డమ్మెల్స్, బార్‌బెల్ తదితర వాటితో జిమ్‌లో కుస్తీపడుతున్నారు. బాడీమూవ్‌మెంట్స్, వాల్‌పుషప్స్‌తో పాటు వివిధ రకాల డ్యాన్సులతో వ్యాయామం చేస్తున్నారు. బరువుతో పాటు బీపీ,షుగర్ ఉండే మహిళలు కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్, లీన్ ప్రొటీన్స్, డ్రైఫ్రూట్స్ వాటిని ఆహారంలో తీసుకుంటుంటారు.

ఉత్సాహంగా ఉంటుంది



ఉదయమే జిమ్‌కు వచ్చి వర్కవుట్ చేస్తే రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. నేను బ్యాడ్మింటన్ ప్లేయర్‌ను. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో కూడా పాల్గొన్నా. శరీర ఆకృతితో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జిమ్ ఎంతో ఉపయోగపడుతుంది.

-రుషిత

12 కేజీలు తగ్గాను



జిమ్‌కు రాకముందు నేను 78 కేజీలు ఉన్నాను. జిమ్‌కు వచ్చాక ఇక్కడ నేర్పిస్తున్న వ్యాయామంతో సుమారు 12 కేజీలు తగ్గాను. బరువుతోపాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకుంటున్నా. ఇక్కడ మహిళల వయస్సును బట్టి వివిధ రకాల ప్రొటీన్ ఫుడ్స్ ఇస్తుంటారు. వాటితో బరువు తగ్గడంతోపాటు ఉల్లాసంగా కూడా ఉండొచ్చు. - వినీత

ఎముకల బలిష్టం కోసం జిమ్



మహిళల్లో అత్యధికంగా హార్మోన్లలో అసమతుల్యత ఏర్పడటంతో ఒక్కసారిగా బరువు పెరుగుతారు. దీంతోపాటు ఎముకల బలిష్టం కోసం జిమ్‌కు వస్తుంటారు. ప్రధానంగా వయస్సును బట్టి మహిళలకు జిమ్‌లో వివిధ రకరా పరికరాలతో వ్యాయామం చేయిస్తుంటాం. అత్యధికంగా జిమ్ చేయడం వల్ల నష్టం కూడా జరుగుతుంది.

-అబుజర్, జిమ్ శిక్షకుడు

బరువు తగ్గించుకునేందుకే జిమ్‌కు..



మహిళలు అత్యధికంగా బరువు తగ్గించుకోవడానికే జిమ్‌కు వస్తుంటారు. ప్రధానంగా అధిక బరువు ఉండే మహిళలు ఇంట్లో ఎక్కువగా పని చేసుకునేందుకు వీలుగా ఉండదు. దీంతో పాటు మహిళల్లో ఎక్కువ శాతం థైరాయిడ్ బారిన పడుతుంటారు. అలాంటి వారి కోసం ప్రత్యేకమై జిమ్ వర్క్ అవుట్‌లు చేయిస్తుంటాం.

-కుషిత, జిమ్ శిక్షకురాలు

17 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వరకు..

ఒకప్పుడు జిమ్‌లలో పురుషులే ఉండేవారు. కానీ ప్రస్తుతం 17 ఏళ్ల నుంచి 65 సంవత్సరాల వయస్సు వరకు మహిళలు కూడా ఉన్నారు. వయస్సును బట్టి శిక్షకులు మహిళలకు జిమ్‌లో వ్యాయామం నేర్పిస్తున్నారు. వారికి వ్యాయామ పద్ధతులు, సరైన ఆహారం గురించి తెలపడానికి శిక్షకులు కూడా అందుబాటులో ఉన్నారు. జిమ్‌లో స్త్రీలు కూడా ఫిట్‌నెస్ కోసం హాజరవుతున్నారు. వారి ఆరోగ్యం, శరీర ఆకారం, మానసిక స్థితిని మెరుగుపరుచుకోవడానికి జిమ్‌లో వ్యాయామం చేస్తున్నారు. కొంతమంది మహిళలు పోటీల్లో పాల్గొనడానికి శిక్షణ పొందుతున్నారు. జిమ్‌లో మహిళలు వ్యాయామం చేయడం వల్ల వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వారు తమ శరీరం గురించి మరింత సంతృప్తి చెందుతారు. వారి మానసిక స్థితి మెరుగుపడుతుంది.



రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు

క్రీడల విజయానికి కృషి చేయండి : జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి

నంద్యాల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలను నంద్యాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నుంచి 22 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో 13 జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, 50 మంది క్రీడా అధికారులు పాల్గొననున్నట్లు తెలియజేశారు. అనంతరం క్రీడల ఏర్పాట్లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎన్‌వీ రాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో క్రీడల నిర్వహణ కోసం వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.


అస్టియోపోరాసిస్‌తో

ఎముకలు గుల్ల

- ఎముకలు పెళుసుబారితే ప్రమాదం
- నేడు వరల్డ్ అస్టియోపోరాసిస్ డే

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):

ఎముకలను గుల్ల చేసే వ్యాధిని అస్టియోపోరాసిస్ అంటారు. దీన్ని తెలుగులో బోలు ఎముకల వ్యాధి అని పిలుస్తారు. ఎముకలు బలంగా ఉంటేనే.. మనం ఏ పనైనా చేయగలం. ఎంత బరువైనా ఎత్తగలం. ఎముకలు బలహీనంగా మారితే కనీసం పది నిమిషాలు కూడా కూర్చుని పని చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. కింద పడినప్పుడు చేతులు, కాళ్ల ఎముకలు విరిగిపోతాయి. కొన్ని సందర్భాల్లో ఏ కారణం లేకుండానే ఎముకలు విరగొచ్చు. దీన్ని ఆస్టియోపోరాసిస్ అంటారు. 1996లో మొదటి ఆస్టియోపోరాసిస్ కేసును గుర్తించారు. 1997లో ఇంటర్నేషనల్ అస్టియోపోరాసిస్ ఫౌండేషన్ ప్రపంచ బోలు ఎముకల వ్యాధి దినం నిర్వహిస్తోంది. 2024లో ఇంటర్నేషనల్ అసియోపోరాసిస్ ఫౌండేషన్ పెళుసుగా ఉండే ఎముకలకు నో చెప్పండి అన్న నినాదాన్ని ఇచ్చింది.




ఆస్టియోపోరాసిస్ ప్రారంభ దశలో లక్షణాలేవీ కనిపించవు. వ్యాధి క్రమంగా తీవ్రమై ఎముకలు విరిగినప్పుడే గుర్తించే వీలు కలుగుతుంది. తగినంత సూర్యరశ్మిని అందనివారు, వ్యాయామం చేయనివారు దీని బారిన పడే అవకాశం ఉంది. మద్యపానం, ధూమపానం అలవాటు ఎక్కువగా ఉన్న వారికి, కుటుంబంలో ఇంతకుముందు ఎవరికైనా వ్యాధి ఉన్నవారికి జన్యుపరంగా ఇది వ్యాపిస్తుంది.

లక్షణాలు: వెన్నునొప్పి వస్తుంది. శరీరాకృతి వంగిపోతుంది. ఎత్తు తగ్గుతున్నట్లు కనిపిస్తుంది. చిన్న ప్రమాదాలకే ఎముకలు విరిగిపోతుంటాయి. ఇవి ఈ వ్యాధి సాధారణ లక్షణాలు. వెన్నుపూసలో పగుళ్లు ఏర్పడితే వెన్నుముక తుంటి ప్రాంతంలో నొప్పి వస్తుంది. ఎముకల్లో ఏర్పడిన పగుళ్లు త్వరగా నయం కావు. కోలుకోవడానికి సమయం పడుతుంది.

- **రోగ నిర్ధారణ:** ఎక్స్‌రే ద్వారా ఆస్టియోపోరాసిస్ వ్యాధిని నిర్ధారించవచ్చు. ప్రారంభంలో వ్యాధి లక్షణాలను గుర్తించడానికి, సరైన చికిత్స అందించడానికి డెక్సాస్కాన్ (బోన్ డెన్సిటి స్కాన్) సహాయపడుతుంది. ఈ స్కాన్ కర్నూలు జీజీహెచ్‌లోని న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో ఉంది.



- **చికిత్స ఇలా:** ఈ వ్యాధి బారిన పడిన వారిలో వైద్యుల సలహాలతో మందులు వాడాలి. వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి. మద్యపానం, పొగతాగడం మానేయాలి. ఎముకల ధృఢత్వానికి విటమిన్-డి లభించే ఆహారం తీసుకోవాలి. ప్రతి రోజు ఉదయం ఎండలో ఉండాలి.



ఎముకలను బలోపేతం చేయడానికి శరీరానికి కాల్షియం పదార్థాలైన పాల ఆహారాలు, పాలు, పెరుగు, చీజ్, ఆకుకూరలు, నారింజ, బీన్స్ బఠానీలను తీసుకోవాలి.

మహిళల్లో బోలు వ్యాధి ఎక్కువ



బోలు ఎముకల వ్యాధి మహిళలు ఎక్కువ. 40 నుంచి 50 సంవత్సరాలు ఉన్న మహిళల్లో హార్మోన్ల మార్పుల వల్ల ఎముకలు పలుచబడి ఈ వ్యాధి కనిపిస్తుంది. చాలా మంది రోగులు కాల్షియం ఉన్న ఆహారం, పండ్లు తీసుకోకపోవడం, విటమిన్-డీ లోపం వల్ల ఎముకలు బలహీనమవుతాయి. దేశంలో ఈ సమస్యతో 50శాతం మంది బాధపడుతున్నారు.

- డా.ఎం.రాజేష్ కుమార్, ఆర్థోసర్జన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఆర్థోపెడిక్, కర్నూలు జీజీహెచ్

ప్రారంభదశలో గుర్తించాలి



ఆస్టియోపోరాసిస్ వ్యాధి ప్రారంభదశలో ఎలాంటి లక్షణలు కనిపించవు. వ్యాధి తీవ్రమై ఎముకలు విరిగినప్పుడు మాత్రమే గుర్తించగలం. కాబట్టి ఈ వ్యాధిని ప్రారంభదశలో గుర్తించి చికిత్స తీసుకోవాలి. ఎముకలు బలహీనమైనప్పుడు తుంటి, మణికట్టు, వెన్నముక వంటి ఎముకలు ఫ్యాక్చర్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

- డా.ఎం. విజయకుమార్ రెడ్డి, ఆర్థోసర్జన్, శ్రీచక్ర హాస్పిటల్, కర్నూలు

తీవ్రమైన ఆరోగ్య ముప్పు



బోలు ఎముకల వ్యాధి ప్రమాదకరమైనది. ఈ వ్యాధి కారణాలను గుర్తించి స్కీనింగ్ చేయించుకోవాలి. ముఖ్యంగా వృద్ధుల్లో బోలు వ్యాధి దీర్ఘకాలిక వైకల్యానికి దారితీస్తుంది. మితిమీరిన మద్యపానం, ధూమపానంతో ఎముకలు గుల్లబారుతాయి. రెగ్యులర్‌గా ఎముకల సాంద్రతను పరీక్షించుకుంటూ వైద్యుల సూచన మేరకు చికిత్స తీసుకోవాలి.

-డా. జీవీఎస్ రవిబాబు, జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్, ఆర్థోసర్జన్, కర్నూలు

సమస్యల పరిష్కారంపై అధ్యయనం చేయాలి

పాణ్యం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యార్థులు వాస్తవ జీవనంలో జరిగే సమస్యల పరిష్కారంపై అధ్యయనం చేయాలని ప్రముఖ పరిశ్రమల నిపుణులు పేర్కొన్నారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న కోడ్ క్వెస్ట్24 హ్యాకతాన్ సదస్సు శనివారం ముగిసింది. సీఎస్ఈ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన సాఫ్ట్ క్లౌడ్, వెల్స్ ఫార్గో, స్వొప్రస్టీరియా ఇండియా, రెడీకా సిస్టమ్స్, రాక్‌స్టార్ గేమ్స్ చెన్నై కుచెందిన ఫోర్డ్ మోటార్స్ కంపెనీ, హైదరాబాదుకు చెందిన టాటా కనసల్టెన్సీ సర్వీసెస్‌కు చెందిన సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల సదస్సులో విద్యార్థులకు ఇచ్చిన ప్రాజెక్టుల్లో ఎంతో ప్రతిభ కనబర్చారన్నారు. మన చుట్టూ ఉండే పలు సమస్యలను గుర్తించడంలో విద్యార్థులు ఎంతో నైపుణ్యం సాధించారని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల సమస్యలు, ఉన్నత స్థాయికి ఎదిగిన వారి అభిప్రాయాలు సేకరించడం హర్షణీయమన్నారు. సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఎంచుకున్న విధానాలు ఎంతో ఆలోచింపజేశాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బృందాలకు యాపిల్‌మ్యాక్ బుక్, హెచ్‌పీ విక్టర్స్, ఏసర్ ఆస్పైర్‌లు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమల నిపుణులు హర్షప్రసాద్, సుధాకర్ కాటం, కిషోర్‌కుమార్, వెంకటసాయినాథ్, కార్తీక్, రోషన్ జమీర్, డీన్ రామిరెడ్డి, హెచ్‌ఓడీ డాక్టర్ సుబ్బారెడ్డి, భాస్కరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రాజెక్టు విజేతలతో పరిశ్రమల నిపుణులు, అధ్యాపకులు

రబీ పంటలకు మద్దతు ధర

- రైతులకు ఊరట



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత రబీలో సాగు చేస్తున్న పంటలకు మద్దతు ధరను పెంచింది. ప్రధానంగా ఈ సీజన్‌లో సాగయ్యే పప్పుశనగతోపాటు ఆవాలు, ఎర్ర కంది పప్పు, బార్లీ, గోధుమ, కుసుమ పంటల మద్దతు ధరను పెంచుతూ రెండు రోజుల క్రితం కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పప్పుశనగతోపాటు ఆవాలు, కొంత మేర గోధుమ, కుసుమ పంటలను సాగు చేస్తున్నారు. శనగ పంటకు గత సంవత్సరం క్వింటానికి రూ.5,440 మద్దతు ధర ఉండగా.. ప్రస్తుత రబీ నుంచి రూ.5,550 అంటే రూ.210 అదనంగా పెంచారు. అదే విధంగా కుసుమ పంటకు గత ఏడాది రూ.5,800 ధర ఉండగా.. ఈసారి రూ.5,940కు అంటే రూ.140 అదనంగా పెంచారు. గోధుమ పంటకు రూ.2,275 ధర ఉంటే.. ఈసారి రబీకి రూ.2,425 ధరను పెంచారు. దీని వల్ల రూ.150 అదనంగా పెంచినట్లయింది.

పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రస్తుతం రబీలో రైతులు శనగ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. కుసుమ, గోధుమ కొంత మొత్తంలోనే సాగవుతోంది. తాజాగా పెరిగిన మద్దతు ధరల నేపథ్యంలో పై పంటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంపై పంటలకు పెంచిన మద్దతు ధరలను దృష్టిలో ఉంచుకుని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ పంటల సాగుకు పెట్టుబడి మిగిలిన పంటలతో పోలిస్తే చాలా తక్కువ. దిగుబడి ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. శనగ పంట సాగుకు ఎకరాకు అన్ని ఖర్చులు కలిపి రూ.8వేల దాకా అవుతుంది. వేరుశనగ, వరి మొక్కజొన్న తదితర పంటల సాగు ఖర్చుతో పోలిస్తే.. ఈ పెట్టుబడి చాలా తక్కువ అని రైతులు పేర్కొంటున్నారు. సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే నల్లరేగడి పొలాల్లో 6 నుంచి 7 క్వింటాళ్ల శనగ పంటలో దిగుబడి వస్తుంది. ఎర్రనేలలు, తువ్వ తదితర పొలాల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి కుసుమ సాగుకు పెట్టుబడి రూ.12వేలు అవుతుంది. నల్లరేగడి పొలాల్లో ఈ పంట దిగుబడి 7 నుంచి 8 క్వింటాళ్లు చేతికి అందుతుందని, సాధారణ పొలాల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, అదే విధంగా గోధుమ సాగులో ఎకరాకు రూ.10వేలు పెట్టుబడి అవుతుందని, దిగుబడి రూ.6 క్వింటాళ్ల వరకు లభిస్తుందని రైతులు చెబుతున్నారు.

మద్దతు ధర పెరగడంతో రైతులకు ఊరట



కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత రబీలో శనగతో పాటు గోధుమ, కుసుమ, ఆవాలు తదితర 6 పంటలకు మద్దతు ధరలను పెంచింది. గత సంవత్సరంతో పోలిస్తే.. 150 నుంచి 200 అదనంగా పెంచారు. ఈ ధరలు 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు అమలులో ఉంటాయి. ఈ పంటల సాగుకు పెట్టుబడి తక్కువే.

- శాలురెడ్డి, ఏడీఏ

25న ఆలయ భూములకు వేలం

కర్నూలు, అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖకు చెందిన భూములను ఈనెల 25న బహిరంగ వేలం ప్రక్రియ చేపడుతున్నామని కల్లూరు దేవదాయ శాఖ ఈవో గురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 145, 293 సర్వే నెంబర్లలో ఈశ్వర వీరభద్ర టీమేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన రెండు ఎకరాల భూమిని దేవదాయశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు బహిరంగ వేలం టెండర్ ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. లక్ష రూపాయలు దేవస్థానం పేరుతో డీడీ రూపంలో చెల్లించాలని అన్నారు. ఎక్కువ మొత్తానికి వేలంపాటలో, ఈ టెండర్, సీల్డ్ టెండర్ ద్వారా కోట్ చేసినవారికి 11 సంవత్సరాల పాటు లీజు ఇస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9603528537 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

కేంద్ర దర్యాప్తు సంస్థ పేరుతో బెదిరింపులు

● బియ్యం వ్యాపారి, డీఎస్పీపై నకిలీ అధికారుల చిందులు ● అనుమానం రావడంతో అదుపులోకి..

కర్నూలు క్రైం/ఓర్వకల్లు, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): కేంద్ర దర్యాప్తు సంస్థ పేరుతో కొంతమంది యువకులు శనివారం రచ్చ రచ్చ చేశారు. ఓ బియ్యం వ్యాపారికి ఫోన్ చేసి బెదిరింపులకు దిగారు. అనంతరం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తీరా వారంతా నకిలీ మీడియా రిపోర్టర్లని గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ప్రకాశం జిల్లా రాచర్లకు చెందిన పాలకీటి మధుసూదన్, తాళ్లపల్లె గ్రామానికి చెందిన సీలం అంకిరెడ్డి, పాణ్యం మండలం మత్తూరుకు చెందిన పరదేశి రవికుమార్, నంద్యాల పట్టణానికి చెందిన కొరతాల మహేష్, ఓర్వకల్లు మండలం ఉప్పలపాడుకు చెందిన ఆవుల మధులు ఒక ముఠాగా ఏర్పడి నకిలీ జర్నలిస్టులు, కేంద్ర అధికారుల గుర్తింపు కార్డులను తయారు చేసుకున్నారు. వీరందరూ నంద్యాల, కర్నూలులో నివాసం ఉంటూ నకిలీ విలేకరులుగా, అధికారులుగా చెలామణి అయ్యేవారు. ఈ ఐదుగురు కలిసి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు రాగమయూరి కాలనీలో బియ్యం వ్యాపారం చేసే బెస్త గంగాధర్ ఇంటికి వెళ్లారు. తాము కేంద్ర దర్యాప్తు సంస్థ కమిషన్ నుంచి వచ్చామని చెప్పారు. బియ్యం అక్రమ రవాణా చేస్తున్నావంటూ బెదిరించి రూ.5లక్షలు



నిందితుల అరెస్టు చూపుతున్న కర్నూలు డీఎస్పీ

డిమాండ్ చేశారు. అయితే గంగాధర్ రూ.10 వేలు ఇవ్వడంతో ఆగ్రహంతో ఊగిపోయారు. అక్కడి నుంచే కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్‌కు ఫోన్ చేశారు. 'మేము ఢిల్లీ నుంచి వచ్చిన జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఇండియా.. నేషనల్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ కమిషన్ సభ్యులమంటూ చెప్పుకొచ్చాడు. ఇక్కడ గంగాధర్ అనే వ్యక్తి బియ్యం పెద్ద ఎత్తున అక్రమ రవాణా చేస్తుంటే మీ పోలీసులు నిద్రపోతున్నారా' అంటూ డీఎస్పీపై చిందులు తొక్కాడు. ఇందుకు డీఎస్పీ స్పందిస్తూ 'మీరు నిజంగా కమిషన్ అయితే.. అలా నేరుగా రైడింగ్‌కు వెళ్లకూడదని, రెవెన్యూ అధికారులను గానీ, పోలీసులనుగానీ సంప్రదించి రైడింగ్ జరపాలని' సూచించాడు. దీంతో డీఎస్పీపై నిందితులు మరింత రెచ్చిపోయారు. 'మీపై ఢిల్లీ స్థాయిలో ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. ముందు నువ్వు ఇక్కడకు రావాలంటూ' హుకుం జారీ చేశారు. డీఎస్పీకి అనుమానం రావడంతో అక్కడకు వెళ్లాలని కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడును ఆదేశించారు. దీంతో ఆయన ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని వారిని ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ కూడా నకిలీ అధికారులు స్టేషన్‌లోని పుస్తకాలను చిందరవందర చేస్తూ 'ఢిల్లీ అధికారులంటే లెక్కలేదా..' అంటూ నానా హంగామా చేశారు. చివరికి వారి ఐడీ కార్డులు నకిలీవి అని నిర్ధారించుకున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంతలో ఈ కేసు దర్యాప్తు చేయవద్దని, ఏదో తెలియక చేశారంటూ పెద్దఎత్తున పోలీసులకు ఫోన్లు వచ్చాయి.



నకిలీ ఐడీ కార్డులు, జర్నలిస్టు గుర్తింపు కార్డులు

● ఢిల్లీలో ఫార్చునర్ వాహనం కొనుగోలు

నిందితుడు ఢిల్లీలో ఫార్చునర్ వాహనం రూ.15 లక్షలకు కొనుగోలు చేసినట్లుగా పోలీసుల విచారణలో తేలింది. అయితే ఢిల్లీ రిజిస్ట్రేషన్‌ను ఏపీ రిజిస్ట్రేషన్‌గా మార్చుకోకుండానే ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఢిల్లీ రిజిస్ట్రేషన్ అయితే ఎలాంటి అనుమానం రాదని ఇలాంటి వాహనం వాడుతున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. గతంలో కూడా బనగానపల్లెలో ఓ బియ్యం వ్యాపారి నుంచి రూ.1.15 లక్షలు నగదు వసూలు చేసినట్లు తేలింది. నిందితుల్లో ఒకడైన ఉప్పలపాడుకు చెందిన ఆవుల మధు బియ్యం వ్యాపారం చేస్తుంటాడు. జిల్లాలో బియ్యం వ్యాపారం చేసే ప్రధాన వ్యక్తులు కూడా మధుకు తెలుసు. ఇలా బియ్యం వ్యాపారం చేసే వారిని టార్గెట్ చేశారు. ఆవుల మధు కూడా గంగాధర్ వద్ద బియ్యం వ్యాపారం చేసేవాడు. గంగాధర్‌ను బెదిరిస్తే డబ్బులు వస్తాయనీ ప్రణాళిక రూపొందించింది ఆవుల మధునే కావడం కొసమెరుపు.





ఆర్‌యూ ప్రొఫెసర్‌కు మెమో

కర్నూలు, అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ ప్రొఫెసర్ గత నెలలో తన పుట్టిన రోజు వేడుకలకు వసతి గృహాల్లోని విద్యార్థులను ఇంటికి పిలుచుకోవడం వివాదాస్పదమైంది. ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ బ్రాంచి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఈయన గతంలో నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కోవడంతో విధుల నుంచి తొలగించారు. ఆ తర్వాత వర్సిటీలో చేరినా ప్రవర్తన మార్చుకోలేదని కొందరు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వర్సిటీలోని రెండు వసతి గృహాల్లో వార్డెన్ల అనుమతి లేకుండా విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లడం వివాదాస్పదంగా మారింది. మహిళా వసతి గృహం నుంచి విద్యార్థినిలను పంపించకపోవడంతో వార్డెన్‌తో ఆయన వాగ్వాదానికి దిగాడని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేసి ఊటీ లాంటి విహార యాత్రకు పంపించాడనే మరో ఫిర్యాదు ఉన్నతాధికారులకు చేరింది. వర్సిటీలో కొందరు విద్యార్థులతో ఒక గ్యాంగ్‌ను ఏర్పాటు చేశాడని, కొందరు ప్రొఫెసర్లను టార్గెట్ చేసుకుని వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. స్పందించిన ఉన్నతాధికారులు ఆయనకు మెమో జారీ చేస్తూ.. ముగ్గురు ప్రొఫెసర్లతో విచారణకు కమిటీ వేశారు. కమిటీ నివేదిక ప్రకారం చర్యలు ఉంటా యని, వర్సిటీకి చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు వద్ద ప్రస్తావించగా కొత్తగా వచ్చానని, తెలుసుకుని స్పందిస్తానని తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతానికి సమష్టిగా పని చేయాలి



కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు బి.లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. శనివారం నంద్యాలలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డోన్, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల కార్యకర్తల సమీక్షాసమావేశం జరిగింది. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థాయినుంచి జిల్లా స్థాయి, నియోజకవర్గ, మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ఓటుబ్యాంకును పెంచుకునే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 2029లో భారతదేశ ప్రధానిగా రాహుల్‌గాంధీని చేసే విధంగా ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోరారు. నియోజకవర్గాల నాయకులు మద్దిలేటిస్వామి, జనార్దన్, సుబ్బుయాదవ్, వడ్డె రాజశేఖర్, రామాంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచరుడి భూ కబ్జా

- రూ.1.50 కోట్ల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



కబ్జాకు గురైన స్థలం



బాధితుడు హరీశ్‌బాబు

ఆదోని /కర్నూలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అనుచరుడు, డెంటిస్ట్ డాక్టరు రవికిరణ్ భూ కబ్జాకు పాల్పడి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని బాధితుడు ఎంకే హరీశ్‌బాబు ఆరోపించారు. నిందితులపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన వెల్లడించారు. బాధితుడి కథనం మేకు.. ఆదోని పట్టణం మండిగిరి గ్రామం సర్వే నంబరు 379/బి, 380ఏ పరిధిలోని శ్రీకృష్ణదేవ రాయ నగర్ కాలనీలో ఉన్న ఎల్‌పీ నంబరు 3/83 లేఅవుట్‌లో 300 చదరపు అడుగుల (దాదాపు ఆరు సెంట్లు) స్థలం ఉంది. ఈ స్థలాన్ని హరీశ్‌బాబు తల్లి కురువ హనుమంతమ్మ 1984 నవంబరు 28న కొనుగోలు చేసింది. ఈ మేరకు ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నంబరు 3359/1984 కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 40 ఏళ్లుగా ఆ స్థలం వీరి ఆధీనంలోనే ఉంది. ప్రస్తుతం వీరు కర్నూలులో ఉంటున్నారు. అయితే వీరు స్థానికంగా లేరని గుర్తించిన డెంటిస్ట్ డాక్టర్ రవికిరణ్ ఆయన తల్లి జె.లక్ష్మి ఫొటోతో కురువ అనుమంతమ్మ పేరిట నకిలీ ఆధార్ కార్డు సృష్టించాడు. అనంతరం సమీప బంధువు చిప్పల సురేశ్‌బాబు పేరిట ఈ నెల 16న ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న హరీశ్‌బాబు ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారించడంతో నకిలీ ఆధార్ కార్డు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. దీంతో డాక్టర్ రవికిరణ్, ఆయన తల్లి జె.లక్ష్మి, చిప్పల సురేశ్‌బాబులపై బాధితుడు డీఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై సబ్ రిజిస్ట్రార్ అజిమియా, డాక్టర్ రవికిరణ్‌ల వివరణ కోసం ఆంధ్రజ్యోతి ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కాల్వలో దొంగల బీభత్సం

● నాలుగు ఇళ్లలో చోరీ ● బంగారు, నగదు అపహరణ

ఓర్వకల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాల్వ గ్రామం బస్టాండు సమీపంలోని కొత్త బిల్డింగులో శనివారం తెల్లవారు జామున దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని నాలుగు ఇళ్లలో తలుపులు పగులగొట్టి రూ.8 లక్షల విలువైన ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. విషయం తెలిసిన వెంటనే ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ గ్రామాన్ని సందర్శించి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా కుమార్తె వివాహం కోసం బీరువాలో దాచుకున్న రూ.3 లక్షల నగదుతోపాటు ఐదు తులాల బంగారు నగలను అపహరించారు. అలాగే వెంకటసుబ్బమ్మ అనే ఒంటరి మహిళ ఇంట్లో చొరబడి రూ.40వేలు, జాకీర్‌బాషా, దేశాయినూర్ ఇళ్లలో బంగారు కమ్మలు, జింకీలతో పాటు కొంత నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడలిని హత మార్చిన మామ అరెస్టు

నందికొట్కూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోడలిని చంపిన కేసులో మామతోపాటు మరో నలుగురిని అరెస్టు చేశామని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నందికొట్కూరు మండలం నాగటూరు గ్రామానికి చెందిన శిరీషను ఆమె మామ కురుమన్న శుక్రవారం బండరాయితో బాది చంపాడని చెప్పారు. ఈ కేసులో కురుమన్నతోపాటు, శిరీష అత్త శేషమ్మ, భర్త నరసింహులు, ఆడపడుచులు మల్లేశ్వరి, వేనమ్మలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నిందితులను విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిరీష హత్యతో అభం శుభం తెలియని చిన్నారులు పావని, నవదీప్‌లు తల్లిలేని పిల్లలయ్యారు.





పోలీసు స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న శిరీష బంధువులు, దీనంగా ఉన్న శిరీష పిల్లలు పావని, నవదీప్

పోలీసుస్టేషన్ ముట్టడి : పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని తమకు అప్పగించాలంటూ శిరీష కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసుస్టేషన్ ముందు నిరసన చేపట్టారు. నిందితులను ఆరోగ్య పరీక్షల నిమిత్తం తీసుకెళ్లే సమయంలో ఒక్కసారిగా స్టేషన్ గేట్లను తోసుకుంటూ లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. నిందితులను తమకు అప్పగించాలని పట్టుబట్టడంతో పోలీసులు వారిని శాంతింపజేసి నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చేస్తామని భరోసా ఇచ్చారు.

మంత్రి పేరుతో వేధింపులు!

- సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన బాధితులు
- విచారణకు ఆదేశించిన మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని ట్రాఫిక్ పట్టణ పోలీసు లైన్ మసీదుకు సంబంధించి బాడుగదారులను మంత్రి టీజీ భరత్ పేరు చెప్పి కొందరు వ్యక్తులు వేధింపులకు గురిచేస్తున్నారు. అద్దె ఎక్కువగా ఇవ్వాలంటూ దౌర్జన్యం చేస్తున్నట్లు బాధితులు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ విషయంపై విచారణ చేపట్టాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి నగర పాలక కమిషనర్‌కు లేఖ వచ్చింది.

నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపం లోని మసీదుకు సంబంధించి దుకాణాలలో ఏళ్ల తరబడి కొందరు వ్యాపారాలు చేసు కుంటున్నారు. ప్రతి నెలా అద్దె చెల్లించడంతో పాటు మున్సిపల్ పన్ను కూడా సక్రమంగా చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక చట్ట విరుద్ధంగా కొత్తగా కమిటీ వేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని బాడుగదారులు సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటయిన వెంటనే మంత్రి చెప్పారని, బాడుగ పెంచాలని డిమాండ్ చేసినట్లు బాధితులు లేఖలో ప్రస్తావించారు. ప్రతి దుకాణానికి ఎన్నడూ లేని విధంగా కొలతలు వేయడంతోపాటు కొత్తగా దుకాణాలకు నెంబర్లు కూడా వేసినట్లు తెలిపారు. మంత్రి పేరును వాడుకుని కొందరు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని బాధితులు సీఎంకు పంపిన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. మసీదు కమిటీలో మంత్రి దగ్గర పని చేస్తున్న సెక్యూరిటీ ఆఫీసర్ షేక్ యూనుస్ బాషా, ఇతడి బాబాయి షేక్ హుసేన్‌బాషా, బావమరిది షేక్ ఇస్మాయిల్‌తో పాటు మసీదుకు సంబంధం లేని ఇద్దరిని కలిపి మొత్తంగా ఐదుగురితో కమిటీ వేశారన్నారు.

ఇదిలా ఉండగా ఈ అంశంపై నగరపాలక సంస్థ అధికారులు విచారణ చేపడుతున్నారు. తన పేరును వినియోగించి ఎవరైన అతిగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటా యని ఇటీవల మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తేలా వ్యవహరిస్తే ఎంతటివారైనా సరే విచారించి చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే.

పిడుగుపాటుతో మహిళ మృతి

కోడుమూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 19: మండలంలోని అనుగొండలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన బాలమద్దిలేటి భార్య మంజుల (35), మరో నలుగురు పొగాకు పొలంలో కలుపుతీత పనులకు వెళ్లారు. సాయంత్రం మరో గంటలో ఇంటి ముఖం పట్టే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. ఆ సమయంలో అకస్మాత్తుగా పెద్ద శబ్దం రావడంతో మహిళలందరూ పొలంలో పడుకున్నారు. శబ్దం తీవ్రత తగ్గిన తర్వాత మహిళలు పైకి లేచి కూర్చున్నారు. అయితే మంజుల స్పందించక పోవడంతో మిగతా కూలీలు హుటాహుటిన గ్రామం లోకి చేర్చారు. మంజులను వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో కుటుంబసభ్యులు దుఃఖసాగరంలో మునిగి పోయారు. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.



మంజుల (ఫైల్)

ప్రేమోన్మాది వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య

ఆస్పరి, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): ప్రేమోన్మాది వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన మండలంలోని నగరూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు యువతిని ప్రేమించమని గత కొద్ది రోజులుగా వేధిస్తున్నాడు. తన ప్రేమను యువతి తిరస్కరిస్తూ వచ్చింది. అయినా యువకుడు వినకుండా అమ్మాయిని వేధింపులకు గురి చేస్తూ శుక్రవారం యువత కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఇంటికి వెళ్లి తనను ప్రేమిస్తావా లేదా చస్తావా, చంపాలా అని భయ భ్రాంతాలకు గురి చేయడంతో తీవ్ర అసంతృప్తికి గురై యువతి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. యువతి తల్లిదండ్రులు పొలం పనికి వెళ్లి మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ఘటనలో జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వెంకటరమణకాలనీలో సత్యవేదమ్మ(28) ఇంట్లో దుస్తులు ఉతుకుతూ మోటారు వేసేం దుకు ప్లగ్‌ను సాకెట్‌లో పెటింది. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందిందని వైద్యులు గుర్తించారు. భర్త గిరిబాబు ఆటో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈమెకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

పనిచేస్తూ ఎలక్ట్రీషియన్..

ప్రకాష్‌నగర్‌లో ఓ ఇంట్లో పని చేస్తుం డగా ముత్తు (19) అనే ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. బండిమెట్టకు చెందిన ముత్తు ఎలక్ట్రికల్ పని చేస్తుంటాడు. శనివారం సాయంత్రం బిల్డింగులో ఎలక్ట్రికల్ పని చేస్తుండగా.. ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. వారి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

గుట్టలు గుట్టలుగా

చెత్తా చెదారం



● కూరగాయల వ్యాపారుల నిర్లక్ష్యం
● ఎక్కడ చూసినా పేరుకుపోతున్న వైనం





కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఎక్కడ చూసినా దుర్గంధమే. చెత్తాచెదారం గుట్టలు గుట్టలుగా పేరుకుపోతోంది. కాంట్రాక్టర్లు, కూరగాయల వ్యాపారులు మార్కెట్ యార్డుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. కూరగాయల వ్యాపారులు ఎక్కడబడితే అక్కడ ఇష్టారాజ్యంగా మిగిలిపోయిన, పాడైపోయిన కూరగాయలను ఖాళీ స్థలాల్లో పారవేస్తున్నారు. ఈ వర్షాలకు ఆ ప్రాంతమంతా కుళ్లిపోయిన కూరగాయలతో దుర్గంధం వెదజల్లుతోంది. పంట ఉత్పత్తులు, కూరగాయలు అమ్ముకోవడానికి వచ్చిన రైతులు అనారోగ్యానికి గురై మంచాన పడుతున్నారు. ఎప్పటి నుంచో అధికారులు కూరగాయల వ్యాపారులను హెచ్చరిస్తున్నా వారు పెడచెవిన పెడుతున్నారు. వ్యాపారులు కుళ్లిపోయినా, పాడైపోయిన కూరగాయలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని, లేకపోతే పెనాల్టీ విధిస్తామని మార్కెట్ కమిటీ అధికారులు చెబుతూనే ఉన్నారు. వ్యాపారులు బేఖాతరు చేస్తూ వస్తున్నారు. చివరికి అధికారులు కమిటీ డబ్బులు ఖర్చు పెట్టి చెత్త కుండీలను కూడా ఏర్పాటు చేశారు. వాటిని కూడా వ్యాపారులు ఉపయోగించుకోవడం లేదు. ఫలితంగా కోల్డ్ స్టోరేజీ ప్లాంటు వద్ద, ఎండుమిర్చి ప్లాట్‌ఫారాల వెనుక వైపు చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో వర్షం నీరు బయటకు వదిలేందుకు అవకాశం లేకుండా పోతోంది. యార్డు సమీపంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న డ్రైనేజీ నీటిని యార్డు గుండా పంపుతున్నారు. ఇప్పటికైనా మార్కెట్ కమిటీ అధికారులు, కూరగాయల వ్యాపారులు ఇతర పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే ప్రాంతంలో చెత్తను నిల్వ చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్ ఆవరణలో చెత్తాచెదారం

సీఎంను కలిసిన పాలూరి రవి గువేరా



చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న పాలూరి రవి గువేరా

కర్నూలు లీగల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, కర్నూలు న్యాయవాది పాలూరి రవిగువేరా సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బార్ కౌన్సిల్ సభ్యులతో కలిసి శనివారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కర్నూలులో రాష్ట్ర హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తానని చంద్రబాబు ఎన్నికల ముందు ప్రకటించారని, ఇటీవల బహిరంగంగా సంసిద్ధతత వ్యక్తం చేసి నందుకు ఆయన ఈ సందర్భంగా ముఖ్య మంత్రికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ మేరకు తమ ప్రయత్నాలు కార్యరూపం దాల్చుతాయని ఆయన హామీ ఇచ్చారని రవిగువేరా తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పలు డిమాండ్లను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందిం చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి రాష్ట్ర బార్ కౌన్సిల్ రూ.10లక్షల విరాళాన్ని వరద బాధితుల సహాయార్థం అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఆలూరు రామిరెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ఉన్నారు.

విష్ణును విమర్శించే స్థాయి నీది కాదు

టీడీపీ సీనియర్ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కర్నూలు, అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్ రెడ్డిని విమర్శించే స్థాయి నాగరాజు యాదవ్‌కు లేదని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ వేమన్న గౌడ్ అన్నారు. శనివారం నగరంలోని ఎన్‌వీ రెడ్డి హోటల్లో కోడుమూరు నియోజకవర్గం సర్పంచుల సంఘం నాయకుడు జయన్నతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపల సహకార సొసైటీ సంఘం భవనంలో మద్యం షాపు ప్రారంభించడంతో రైతులు, స్థానికులు, ఉద్యోగులు, వ్యాపారులు ఆందోళన చేశారని అన్నారు. దీన్ని ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డికి ఆపాదించడం సరైన పద్ధతి కాదన్నారు. అసలు నాగరాజు యాదవ్ వెనుక ఉండి ఎవరు రాజకీయాలు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాండ్రపాడు సర్పంచ్ జయన్న మాట్లాడుతూ ప్రజల్లో తమ స్థానం ఏంటో తెలుసుకొని నాగరాజు యాదవ్, సుధాకర్‌రెడ్డిలు మాట్లాడాలన్నారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవితో కలిసి మద్యం సిండికెట్ వ్యాపారాలు చేస్తున్న మీకు విష్ణువర్ధన్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు. నామినేటెడ్ పదవి రాకుండా అడ్డుకునే క్రమంలోనే ఇలాంటి కుట్ర రాజకీయాలకు తెగబడుతున్నారని సీనియర్ నాయకులు వీరన్న గౌడ్ ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో గోపాల్, సురేష్, మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

కర్నూలు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసు అమరుల కుంటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ముగ్గురు పోలీసు అమరుల కుటుంబ సభ్యులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో మృతి చెందిన మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ ఎస్.రమేష్ భార్యకు రూ.లక్ష కార్పస్ ఫండ్ చెక్కును, ఆర్మ్‌డు రిజర్వుడ్ హెడ్ కానిస్టేబుల్ పి.ఖాన్ భార్య నసీమా ఖాతూన్‌కు రూ.లక్ష చెక్కును అందజేశారు. అలాగే జీవిత బీమా, జీపీఎస్, పెన్షన్ గ్రాట్యూటీ, ఏపీజీఎల్ఐ అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాబు ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు ప్రసాద్, కేశవరెడ్డి, ఆర్ఐ నారా యణ, పోలీసు సంఘం అధ్యక్షుడు నాగరాజు, డీపీవో సూపరింటెండెంట్లు, పోలీసు కుటుంబాలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో గార్గేయపురం సమీపంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతురాలిని పరిశీలించారు. మృతురాలి వయస్సు 55-60 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. శరీరంపై తెలుపు, ఎరుపు, నలుపు రంగులతో ఉన్న పూల డిజైన్ చీర ఉంది. చేతులకు ఇత్తడి గాజులు ఉన్నాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు తాలుకా పోలీసులను సంప్రదించాలని సీఐ శ్రీధర్ సూచించారు.

మహిళ అదృశ్యం

కర్నూలు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. ఈ నెల 10న ఆమె డ్యూటీకి వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంత వరకు తిరిగి రాకపోవడంతో భర్త బంధువుల ఇళ్లలో ఆరా తీశారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

అధిక శబ్దాల వాహనాలపై స్పెషల్ డ్రైవ్

కర్నూలు క్రైం, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): నగరంలో అధిక శబ్దాలు చేస్తూ ప్రయాణించే వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వెంకటరమణ కాలనీ వద్ద ఈ తనిఖీలు చేపట్టారు. పెద్ద పెద్ద శబ్దాలు తగిలించే సైలెన్సర్లు పెట్టుకున్న ద్విచక్ర వాహనాదారులను అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేకమైన పరికరాలతో ఆ శబ్దాలను పరిగణనలోకి తీసుకుని పది మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేద్దాం

కర్నూలు, అర్బన్, అక్టోబరు 19,(ఆంధ్రజ్యోతి): ఈనెల 26వ తేదీ నుంచి తెలుగుదేశం పార్టీ చేపట్టే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వీటీ విజయకుమార్ పిలుపునిచ్చారు. సభత్వం రూ.100, శాశ్వత సభ్యత్వ రూ.లక్ష తీసుకోవాలని కోరారు. ప్రమాద బీమా గతంలో ఉన్న రూ.2 లక్షలను రూ.5 లక్షల వరకు పెంచారన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన కార్యకర్తలకు మట్టి ఖర్చుల కింద రూ.10వేలు ఇస్తారని తెలిపారు.

గ్రామ సభలను వినియోగించుకోండి



జులకల్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్

గూడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభలను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శనివారం గూడూరు మండలం జులకల్ గ్రామంలో రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలు పరి ష్కార కార్యక్రమం గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా భూమల రీ సర్వేలో జాయింట్ ఎల్‌పీ, ఖాతాలు తప్పుగా పడటం, ఇమ్యూటేషన్ ఇతర సమస్యలపై రైతుల నుండి అర్జీలను అధికారులు స్వీకరించారు. రీ సర్వే డీటీ లోకేశ్వరరెడ్డి, సర్వేయర్ బాలు నాయక్, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రా రెడ్డి, వీఆర్‌వో జాకీర్, రైతులు పాల్గొన్నారు.

కల్లూరు: గ్రామ సభలను రైతులు వినియోగించుకోవాలని కల్లూరు తహసీల్దారు కె. ఆంజనేయులు సూచిం చారు. శనివారం మండలంలోని రేమడూరులో ఆయన రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రేమడూరులో మొత్తం 45 అర్జీలను రైతులు తహసీల్దారు కె.ఆంజనేయులుకు అందజేశారు. అందులో విస్తీర్ణంలో తేడాలు- 29, ఉమ్మడి ఎల్‌పీఎం తొలగింపునకు-7, వెబ్‌ల్యాండ్ సవరణకు-11 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, టీ డీపీ నాయకులు రామానాయుడు, నాగిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొ న్నారు.

కోడుమూరు రూరల్: రీసర్వే తప్పులను సరిదిద్దుకోవడానికి నిర్వహించిన గ్రామ సభలను పురస్కరించుకుని శనివారం వర్కూరులో దరఖాస్తులు పోటెత్తాయి. రైతులు రీసర్వే తప్పిదాలను అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. ఇందులో విస్తీర్ణంలో వ్యత్యాసం సంబంధించి 58, జాయింట్ ఎల్‌పీఎం స్ప్లిట్టింగ్ 16, ఆన్‌లైన్ నమోదు సమస్య 12, ఎల్‌పీఎం మిస్ మ్యాపింగ్ 5, పాస్ పుస్తకం కోసం 7 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. గ్రామసభకు డివిజినల్ సర్వే అధికారి సుబ్బారెడ్డి హాజరై పరిశీలించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ క్రిష్ణమూర్తి, వీఆర్వోలు యల్లప్ప, నారాయణ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రీసర్వే డిటీ షర్మిళా రెడ్డి అన్నారు. శనివా రం మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో రీసర్వే పూర్తయిన భూ సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ డీఏ సుబ్బారెడ్డి, సర్వేయర్ శంకర్‌శర్మ, గ్రామ నాయకులు శ్రీనివాసులు, రామకోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

'భగవద్గీతలోని సారాంశాన్ని ఆచరించాలి'

కర్నూలు కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత గ్రంథంలోని సారాంశాన్ని అందరూ ఆచరించాలని కార్మిక శాఖ జిల్లా జాయింట్ కమిషనర్ బాలునాయక్ సూచించారు. శనివారం ఎస్‌ఆర్ పేట సంకల్ బాగ్‌లోని భాష్యం పాఠశాల్లో ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో, రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత ఏర్పాటు చేసిన భగవద్గీత గ్రంథాల ఉచిత పంపిణీ కార్యక్రమానికి బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం భగవద్గీత గ్రంథాలను ఉచితంగా విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఎంఈవో-2గా తైమూరు బాషా

కోడుమూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఆర్ జడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తైమూరు బాషా ఎంఈవో-2గా శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇటీవల ఎంఈవో-2గా ఉన్న శరభయ్య రిటైర్డ్ అయ్యారు. దీంతో ఎం ఈవో -2గా పూర్తి బాధ్యతలను తైమూరు బాషాకు ప్రభుత్వం అప్పగించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

నాణ్యమైన మందులు అందించాలి: ఏవో

కోడుమూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన పురుగు మందులు, ఎరువులను మాత్రమే అందించాలని మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ అన్నారు. స్థానిక రైతు సేవ కేంద్రంలో శనివారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమతి ఉన్న పెస్టిసైడ్స్ మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. రైతులు కాలం చెందిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను రైతులకు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వనరులపై దృష్టి సారించాలి

ఓర్వకల్లు అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): సొంత ఆదాయ వనరులపై పంచాయతీలు దృష్టి సారించాలని ఈవో ఆర్‌డీ సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్ల శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నడకతో ఆరోగ్యమని ఏపీ ఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. వాక్‌ఫర్ ఫ్రీడమ్ నిశ్శబ్ద నడక కార్యక్రమాన్ని అంతర్జాతీయ ఎన్జీఓ ఆస్ట్రేలియా ఏ21 ది మూమెంట్ ఇండియా ముంబై వారి సహకారంతో ప్రగతి రూ రల్ ఎడ్యుకేషన్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం కొండారెడ్డిబురుజు వద్ద మానవహారం నిర్వహించారు. సువర్ణ, నక్కల మిట్ట శ్రీనివాసులు, ఎస్టీబీసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు ప్రశంసాపత్రం



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్‌కు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం కలెక్టర్ పి.రంజిత్ బాషా చేతుల మీదుగా లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రశంసాపత్రాన్ని ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అందుకున్నారు. విద్యారంగం, సేవా రంగం యువత నైపుణ్యాభివృద్ధికి చేసిన సేవలకు గానూ తనకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.

డైరెక్టర్లకు సన్మానం



డైరెక్టర్లను సన్మానిస్తున్న జనసేన నాయకుడు షేక్ అర్షద్

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా నియమితులైన రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ, పర్యాటక అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ముంతా జ్‌లను శనివారం జనసేన కార్యాలయంలో కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జి షేక్ అర్షద్ తదితరులు సన్మానించారు. ఈసందర్భంగా షేక్ అర్షద్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయ కులు నాగ రాజు, బ్రాహ్మణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నగర పాలక సంస్థకు పన్నులు చెల్లించండి

కర్నూలు, అర్బన్, అక్టోబరు 19,(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నులు వెంటనే చెల్లించాలని అదనపు కమిషనర్ ఆర్ జీవీ కృష్ణ ఒక ప్రకటనలో కోరారు. సెలవు రోజు అయిన ఆదివారం కూడా పన్ను వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని, ప్రజలు తమ ఆస్తి, నీటి పన్నులు చెల్లించాలని కోరారు.

మూఢ నమ్మకాలపై అవగాహన

సి.బెళగల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోల కల్లు గ్రామంలోని చెన్న సోమేశ్వరస్వామి ఆయం అవరణలో శనివారం ఎస్ఐ తిమ్మారెడ్డి అధ్యక్షతన మూఢ నమ్మకాలపై కళాకారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు బాషా, సురేష్, కోడుమూరు సీఐ తబ్రేజ్, పోలీసులు పాల్గొన్నారు.

సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం



కర్నూలు ఎస్టీ హాస్టల్‌లో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ బృందం నాయకులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్టీ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిస్తామని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రాగుల రాముడు, రాయలసీమ రీజినల్ ఇన్‌చార్జి మోపిరి సూర్య అన్నారు. శనివారం ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వారు జిల్లా ఫెడరేషన్ నాయకులతో కలిసి జిల్లాలోని ఎస్టీ బాలుర, బాలికల హాస్టళ్లను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కుశ లన్న, ప్రధాన కార్యదర్శి మోట సురేష్, నందాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగసారి సుంకన్న, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి: ఎంఈవో

ఓర్వకల్లు అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): వయోజనులందరినీ అక్షరా స్యులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో ఓంకార్ యాదవ్, ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శనివారం ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి భవన్‌లో సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిరక్షరా స్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంలో భాగంగా ఉల్లాస్ పథకాన్ని రూపొందించిందన్నారు. కార్యక్రమంలో అన్ అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఏపీఎం వెంకట్రామిరెడ్డి, వెలుగు సిబ్బంది, వీవోఏలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

కర్నూలు స్పోర్ట్స్ అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల తో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని సెట్కూరు సీఈవో పి.దీప్తి, ఎక్సైజ్ శాఖ సీఐ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశా లలో మత్తుపదార్థాల వినియోగం, వాటి అనర్థాలు, మహిళల, బాలికలపై లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమణారావు, అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ సీవీ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'అంటరానితనానికి తావు లేదు'

కర్నూలు కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హిందూ సమాజంలో అంటరానితనానికి తావు లేదని వీహెచ్‌పీ కేంద్రీయ సామాజిక సమరసత ప్రముఖ్ దేవ్‌జీ రావత్ అన్నారు. శనివారం నగరంలోని రెవెన్యూకాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన వీహెచ్‌పీ రాష్ట్ర సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మళ్ల సత్యంజీ, కాకర్ల రాముడు, ప్రాణేశ్, 16 జిల్లాల కార్యదర్శులు, సహ కార్యదర్శులు పాల్గొన్నారు.

పల్లె పండుగ వారోత్సవాలు

అభివృద్ధి పనులకు భూమి పూజ

కల్లూరు, అక్టోబరు 19 ఆంధ్రజ్యోతి: గ్రామాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగా వారోత్సవాలు చేపట్టిందని కల్లూరు మండల ఎంపీడీఓ జి.నాగశేషాచలరెడ్డి అన్నారు. శనివారం కల్లూరు మండలం సల్కాపురం, ఎ.గోకులపాడు, నెరవాడ గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మంజూరైన పనులకు ఆయన భూమిపూజ చేశారు. సల్కా పురంలో రూ.10 లక్షలు, ఎ.గోకులపాడులో రూ.15 లక్షలు, నెరవాడలో రూ.5లక్షలతో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, ఈవోఆర్డీ నగేష్, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఏపీఓ మద్దీశ్వరమ్మ, టీడీపీ నాయకులు డి.రామానాయుడు, దేవేంద్రా రెడ్డి, మాజీ సర్పంచు లక్ష్మీవరదారెడ్డి, నెరవాడ జాఫర్, శ్రీనివాసులు, బతుకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని మునగాల, మల్లాపురం గ్రామాల్లో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. మునగాల గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, రూ.2.30 లక్షలతో గోకులం నిర్మాణానికి ఎంపీడీవో శివనాగప్రసాద్, టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు. అలాగే మల్లాపురంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయని టీడీపీ నాయకులు అన్నారు. పల్లెపండుగలో భాగంగా గోరంట్ల గ్రామంలో రూ.27 లక్షల ఉపాధి నిధులతో సీసీ రహదారులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు సర్పంచ్ బాలక్రిష్ణ, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తిరుమలనాయుడు, యువనాయకులు కున్నూరు మధు, గిడ్డయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిధులు లేక పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రామాలకు నిధులిచ్చి పండుగ తీసుకవచ్చారని కొనియాడారు. వర్కూరులో సీసీ రహదారికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీఈ కర్రెన్న, ఏఈ గంగరాజు టీడీపీ నాయకులు మల్లయ్య, సంగమేశ్వరయ్య పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండ లంలోని నన్నూరు, పూడిచెర్ల, కేతవరం గ్రామాల్లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధి హామీ పథ కం కింద మంజూరైన సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీరాజ్ జేఈ సురేంద్రనాథ్ రెడ్డి, నాయకులు నాగేశ్వరరెడ్డి, బాలిరెడ్డి, పుల్లారెడ్డి, తిరుపాలు, ప్రకాశం, విజయుడు, ఖాజామియా పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని గుండ్రేవుల, కొండాపురం, ఈర్లదిన్నె గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్ రత్నమ్మ, అధికారులు, టీడీపీ నాయకులు శంకర్‌బాబురెడ్డి, రఘునాథ్‌రెడ్డిలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు.



సల్కాపురంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు



కేతవరంలో..



గోరంట్లలో..

పల్లె ప్రగతే ప్రభుత్వ లక్ష్యం



భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో పల్లెలు అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మాజీ జడ్పీటీసీ సభ్యులు పి.పురుషోత్తం చౌదరి, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. శనివారం మండలంలోని పెరవలి, మద్దికెర గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. రూ.2 కోట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నర్సిరెడ్డి, టీడీపీ నాయకులు పెద్ద వీరన్న, దస్తగిరి, ఎర్రిస్వామి, దాదా ఖలందర్, ఆనంద్ కుమార్, సుధాకర్, సర్పంచ్ విజయుడు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ సోమన్న, ఎమ్మెల్సీ మధుసూదన్

- డీఎస్పీ సోమన్న, ఎమ్మెల్సీ మధుసూదన్
- ఆదోనిలో విద్యార్థుల ర్యాలీ

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి సమష్టి కృషి చేయ్యాలని ఆదోని డీఎస్పీ సోమన్న, ఎమ్మెల్సీ మధుసూదన్ కోరారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో ఢిల్లీకి చందిన ది మూమెంట్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ ఆయుధాల అక్రమ రవాణా తర్వాత ప్రపంచంలో మూడో అతిపెద్ద వ్యవస్థీకృత నేరంగా మానవ అక్రమ రవాణా ఉండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దీంట్లో మానవ హక్కుల ఉల్లంఘనతో అమాయకులు జీవితాలు బలి అవుతున్నాయన్నారు. రోజూ ఎనిమిది మంది అపహరణకు గురవుతున్నారని, 90శాతం అమ్మాయిలు మహిళలే ఉన్నారన్నారు. కళాశాల విద్యార్థినులు జాగ్రత్త వహించాలని, చైతన్యవంతులు కావాలని సూచించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఫేయిత్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ డానియల్ ప్రేమ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి, ఎన్ఎస్ఎస్ అధికారి జోనాథన్, ఉమాదేవి, వెంకటాంరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ గోవిందు, వీరమ్మ, అధ్యాపకులు ప్రేమ్ కుమార్, మనోజ్, సలోమి, అనిత, ఉషా పాల్గొన్నారు.

22న జాబ్‌మేళా : ఎమ్మెల్యే

పత్తికొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22వతేదీన పత్తికొండ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబూ సూచించారు. శనివారం మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 7వ తరగతి చదువు మొదలుకుని డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన వారికి ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మద్దికెర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పంచాయితీ అభివృద్ధిలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ట్రైనర్స్ హరికృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచులు, పంచాయితీ సభ్యులకు నిర్వహించిన శిక్షణా తరగతులు ముగిసాయి. ఈ సందర్భంగా వారు అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సమావేశాలకు తప్పక హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యాదర్శి పరమేశ్వరప్ప, సభ్యులు ఎస్.లక్ష్మినారాయణ, బాలచంద్ర ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

ఆలూరు, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): రీ-సర్వే పూరైన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ గోవింద్ సింగ్ కోరారు. శనివారం ఆలూరు మండలం మూసనహల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. మండలంలోని గ్రామాల నుంచి మొత్తం 49 వినతులు వచ్చాయని తెలిపారు. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సర్వేయర్ అరుణ జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

పులి పాదముద్రలు కాదు

వెల్దుర్తి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)19: పట్టణ సమీపాన సుబ్బయ్యతాత గుడి పరిసరాల్లో శుక్రవారం గుర్తించినవి పులి పాదముద్ర కావని అటవీ అధికారులు తేల్చారు. రైతుల సమాచారం మేరకు శనివారం యాపర్లపాడు, వెల్దుర్తి ఫారెస్టు బీట్ అధికారులు పాదముద్రలను పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులతో సంప్రదించి అవి కుక్క పాదముద్రలని ధ్రువీకరించారు. రైతులు ఆందోళన చెందవద్దని పొలం పనులు యథావిధిగా చేసుకోవచ్చని తెలిపారు.

మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలి

ఆదోని అగ్రికల్చర్ అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ సమీపంలో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్, విజయ్ డిమాండ్ చేశారు. శనివారం ఎక్సైజ్ శాఖ సీఐ సైదుల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో అధికంగా పేదలు, దినసరి కూలీలు నివసిస్తున్నారన్నారు. మహిళలు నిత్యం పనులకు వెళుతుంటారని మద్యం దుకాణం ఉంటే, ఆకతాయిలు వేధించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు రమేష్, మారెప్ప, గిరి, రాము పాల్గొన్నారు.

'హనుమప్ప సేవలు మరువలేనివి'

మద్దికెర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాజీ మండల సీపీఐ కార్యదర్శి స్వర్గీయ హనుమప్ప సేవలు ఎన్నటికీ మరువలేనివని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కోదండ రాముడు అన్నారు. శనివారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో స్వర్గీయ హనుమప్ప మొదటి వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలవూలలు వేసి నివాళులర్పించారు.

వసతి గృహం తనిఖీ

వెల్దుర్తి, అక్టోబరు, (ఆంధ్రజ్యోతి)19: స్థానిక బాలికల వసతి గృహాన్ని (బీసీ) శనివారం జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి తంగమణి తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట గది, బాత్ రూమ్‌లను పరిశీలించారు. మెనూ పాటించాలని సిబ్బందికి సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణత లో తీసుకోవలసిన మెలకువలు, యాంటీ ర్యాగింగ్, బాల్య వివాహాలపై వార్డెన్ శైలజకు సలహాలు, సూచనలు చేశారు.

జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా రజక సంఘం ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని చేతి వృత్తిదారుల సంఘం కార్యదర్శి కారన్న పిలుపు నిచ్చారు. శనివారం సీఆర్ భవన్‌లో జిల్లా రజక సంఘం మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 23న ఆస్పరిలో నిర్వహిస్తున్నామని అన్నారు. పెద్దయ్య, పెద్దహుల్తి వీరేష్, రాజప్ప, రంగడు పాల్గొన్నారు.

మైనింగ్ పరిశీలన

వెల్దుర్తి, అక్టోబరు, (ఆంధ్రజ్యోతి)19: ట్రైనీ కలెక్టర్ కళ్యాణి గనుల శాఖలో రెండు రోజులు శిక్షణ తీసుకున్నారు. శనివారం నాడు రాచర్లలోని ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీని పరిశీలించారు. బోయినపల్లెలో కాంతారెడ్డి మైనింగ్‌లో సరిహద్దులు, తవ్వకాలు, తరలింపు తదితర ప్రక్రియలకు సంబంధించి తెలుసుకున్నారు

సభలను వినియోగించుకోండి: సబ్ కలెక్టర్

ఆదోని రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభలను రైతులు వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. శనివారం వి.కొండాపురం, దొడ్డనగేరి గ్రామాల్లో వినతులు స్వీకరించారు. రీసర్వేతో నష్టపోయిన 66 మంది వినతులు ఇచ్చారని, పరిశీలించి, పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దార్ శివరాముడు, రీసర్వే డీటీ పెద్దయ్య, సర్పంచు పార్వతమ్మ పాల్గొన్నారు.

కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ భాషా పిలుపు నిచ్చారు. శనివారం ఆర్ట్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. నూతన జాతీయ విద్యా విధానంతో ప్రాథమిక విద్య కుంటుపడుతుందన్నారు. నవంబర్ 12,13 తేదీల్లో ఆదోనిలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. దస్తగిరి, వీరేష్ శ్రీకాంత్, ప్రభాకర్ రెడ్డి, జీవన్, మోహన్, సావిత్రి, పూజ పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

హొళగుంద, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సర్పంచ్ హనుమం తమ్మ, టీడీపీ నాయకుడు కురువ శేషన్న అన్నారు. వందవాగాలి గ్రామంలో శనివారం పల్లె పండుగ నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్‌డీహళ్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. పీఆర్ జేఈ యమునప్ప, ఏపీవో భక్తవత్స లం, కార్యదర్శి రంగస్వామి, పంపారెడ్డి మల్లారెడ్డి, కర్రీలింగ, గంగన్న, అబ్దుల్, వసుంధర్ రెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

అధికారుల సూచనలు తీసుకోవాలి : ఏఓ

మద్దికెర, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలవల్ల పంటలకు ఆశిస్తున్న తెగుళ్ళ, చీడపీడల నివారణకు అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవానలి మండల వ్యవసాయశాఖ అధికారి ఉప్పర రవి అన్నారు. శనివారం మండలంలోని మద్దికెర, బురుజుల గ్రామాల్లో పప్పుశనగ, కంది, పొగాకు పంటలను పరిశీలించారు.

బురుజులలో 120 దరఖాస్తులు : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని బురుజుల గ్రామంలో భూరీసర్వేలో తప్పుల తడకగా ఉండటంతో 120 దరఖాస్తులు గ్రామ సభకు వచ్చాయి. శనివారం మండలంలోని బురుజుల గ్రామంలో సర్పంచ్ పద్మావతి అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభ జరిగింది. బురుజుల గ్రామం చిన్న గ్రామం. ప్రతి ఒక్కరిది రీసర్వే సమయంలో సమస్యలు అధికంగా ఉన్నాయి. దీంతో అధికారులను రైతులు నిలదీశారు. గత ఏడాది నుంచి మాకు భూ సమస్యలు రెవెన్యూ అధికారులకు విన్నవించినా పరిష్కరించడం లేదని ఆరోపించారు. రెవెన్యూ గ్రామ సభలు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నకేశవులు, శ్రీనివాసులు నాయుడు, కొత్తూరు శ్రీనివాసులు, మోహన్, వీఆర్వో రషీదు, తదితరులు పాల్గొన్నారు.

కొంపముంచిన వర్షం

వరి రైతులకు అపార నష్టం

మంత్రాలయం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి వరి పంట పూర్తిగా నేలపాలైంది. నదితీర గ్రామాల్లోని రైతులు 20 వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. వరి కంకి, గింజ దశలో ఉండగా అకాల వర్షం రైతన్నల కొంపముంచింది. దీంతో రైతులు తమపంటలను చూసి లబోదిబోమంటున్నారు. మాధవరం, చెట్నహళ్లి, రాంపురం, బసాపురం, కాచాపురం, నారాయణపురం, మంత్రాలయం గ్రామాలతో పాటు కోసిగి, కౌతళం, పెద్దకడబూరు, నందవరం మండలాల్లోని నదితీర గ్రామాల్లో వరి పంటకు అపారనష్టం వాటిల్లింది. ఈఏడాది తుంగభద్ర నదికి ముందస్తు నీరు విడుదల కావడంతో వరిపంటను అధికసంఖ్యలో రైతులు సాగుచేశారు. మరో నెలరోజులుంటే పంట చేతికంది అప్పులు తీరతాయన్న రైతుల ఆశలు తుఫాను రూపంలో కొట్టుకుపోయాయి. నేలపాలైన వరి పంటను పరిశీలించి పంటనష్టం అంచనావేసి రైతులను ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

కౌతాళం: మండలంలోని మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి చేతికి వచ్చిన వరి పంట పూర్తిగా దెబ్బతిని అన్నదాతలకు కోలుకోలేని దెబ్బతీశాయి. మరో ఇరవై రోజుల్లో కోతకు వచ్చే సమయంలో వాన దేవుడు తమకు తీరని అన్యాయం చేశాడని ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పంట చేతికందుతున్న సమయంలో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు లింగనగౌడ్, మారెప్ప, సిద్దనగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈదు రు గాలుల దాటికి వరి పంట మొత్తం వంగి పోయిందని గింజలు రాలిపోయాయని తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు.


వర్షానికి నేలవాలిన వరి పంట

చట్టాలపై అవగాహన అవసరం: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్ర

గోనెగండ్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న సైబర్‌నేరాలు, చట్టాలపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరమని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర అన్నారు. శనివారం గోనెగండ్లలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, ప్రిన్సిపల్ షహనా పర్వీన్, సిబ్బంది పాల్గొన్నారు.

కున్నూరులో డీఎస్పీ పర్యటన: గొడవలు జీవితాన్ని అంధకారంలో నెట్టిస్తాయని ప్రతి ఒక్కరూ గొడవలకు దూరంగా ఉండాలని డీఎస్పీ ఉపేంద్ర కోరారు. గోనెగండ్ల మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన కున్నూరులో ఆయన పర్యటించారు. గ్రామస్థులతో సమావేశమయ్యారు. గొడవలు, ఫ్యాక్షన్ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఆయన వెంట పోలీస్ అధికారులు ఉన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

కౌతాళం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శ్మశాన వాటికలో విధులు నిర్వర్తించే కాటికాపర్లను ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కాటికాపర్ల సంఘం నాయకులు కోరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి యోగేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు చిన్నమారయ్య మాట్లాడుతూ మండలంలో ఎవరైన మృతి చెందితే గుంతలు తీసి శవాలను పూడ్చిపెట్టడం తమ విధి అని, మృతుల సంబంధికులు ఇచ్చిన నగదుతోనే కుటుంబాలను పోషిస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

టిఫిన్ సెంటర్‌కు రూ.10 వేల జరిమానా


టిఫిన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని అమరావతి టిఫిన్ సెంటర్‌కు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి రూ.10వేల జరిమానా విధించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అమరావతి టిఫిన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించటాన్ని గుర్తించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 10వేలు జరిమానా విధించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేలో జరిగిన తప్పులను సరి చేస్తాం

గ్రామసభల్లో రెవెన్యూ అధికారులు

కోసిగి అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో జరిగిన తప్పులను, రైతులకు భూమి విషయంలో జరిగిన అన్యాయాన్ని సరి చేస్తామని తహసీల్దార్ నిత్యానందరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్‌కు పలువురు రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, నాడిగేని అయ్యన్న, మండల కన్వీనర్ జ్ఞానేష్, ఆర్ఐ శ్రీరాములు, చిన్నతాయన్న, మండల సర్వేయర్లు, వీఆర్వోలు, సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామి పాల్గొన్నారు.

మంత్రాలయం: రీసర్వే జరిగిన భూముల్లో సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని తహసీల్దార్ రవి అన్నారు. శనివారం ఖగ్గల్లు గ్రామంలో రైతులను నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గురురాజ్‌రావు, సర్వేయర్ అశోక్, నాగభూషణ్‌రావు, పుష్ప, రైతులు పాల్గొన్నారు.

నందవరం: ప్రభుత్వ చేపట్టిన గ్రామ సభలతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని మాచాపురంలో గ్రామ సభ ఆర్ఐ జర్నియా ఆధ్వర్యంలో నిర్వహించారు. సమవేశంలో రీ సర్వే డీటీ మహేష్ , సర్వేయర్ అక్బర్‌బాషా, ముగతి శేఖర్, టీడీపీ మండల క్లస్టర్ కాశీంవలి, మాజీ విద్యా కమిటీ ఛైర్మన్ పీరసాబ్, వలీ, మాజీ ఎంపీటీసీ కాలేబు, వెంకట్రాముడు, అనుమంతు పాల్గొన్నారు.

ఆటోలో నుంచి జారిపడి మహిళ మృతి

పెద్దకడుబూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి కాలు జారి కిందపడటంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని ఎమ్మిగనూరు-కోసిగి రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన జయమ్మ(57) తన తోటి కూలీలతో కలిసి ఆటోలో పనులకు వెళ్లింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో జయమ్మ కాలు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

కౌతాళం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు బదినేహల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరినాథరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి ఖో ఖో పోటీల్లో రజియా (ఎనిమిదవ తరగతి), ఉష (ఏడవ తరగతి) ప్రతిభ కనబరిచారన్నారు. ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 25 నుంచి 27 వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరుగు రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: ఎమ్మెల్యే

మంత్రాలయం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కృషి చేస్తామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాంపురం, బసాపురం, కాచాపురం గ్రామాల్లో స్పెషల్ అధికారి నారాయణమూర్తి, ఎంపీడీవో శోభారాణి, ఏఈ మల్లయ్య, ఏపీవో తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పల్లెపండుగలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు గురెడ్డి భీమిరెడ్డి, బాబు రెడ్డి, ఉపాధి ఈసి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోసిగి: పల్లె పండుగలో భాగంగా శనివారం మండల పరిధిలోని కోల్‌మాన్‌పేట, దుద్ది, మూగలదొడ్డి, సజ్జలగుడ్డం గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమానికి టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, నాడిగేని అయ్యన్న, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, చిన్నతాయన్న, ఈవోపీఆర్‌డీ హరున్ రశీద్, టీడీపీ నాయకులు మదిరి వీరారెడ్డి, లక్ష్మన్న, ఎండపల్లి హనుమంతు పాల్గొన్నారు.

కౌతాళం: గ్రామాలను అభివృద్ధి చేసుకుం దామని తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్య దర్శి అడివప్పగౌడ్ అన్నారు. శనివారం మండల అధికారులతో కలిసి టీడీపీ నాయకులు మండలంలోని వల్లూరు, ఉప్పరహల్ గ్రామాలలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, సర్పంచ్ పంపాపతిగౌడ్, నాయకులు వెంకటపతిరాజు, సురేష్‌నాయుడు, సతీష్‌నాయుడు, ఈరన్న ఎంపీడీఓ సుబ్బరాజు పాల్గొన్నారు.

ఉపాధిలో అవినీతిపై విచారణ జరిపించాలి

గోనెగండ్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని టీడీపీ నాయకులు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో మణిమంజరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు, ప్రభుదాస్ మాట్లాడుతూ పెద్దమరివీడు గ్రామంలో ఉపాధిహామీ పథకంలో అవినీతి పాల్పడిన సీనియర్ మేటిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన ఎంపీడీవో విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

వీర శైవలింగాయత్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఎమ్మిగనూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో ఉన్న వీరశైవలింగాయత్‌కు చెందిన పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేస్తున్నట్లు ఆ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వజ్రగిరి రాచోటప్ప, మామిడి మల్లికార్జునలు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్‌లో 90శాతానికి పైగా మార్కులు సాధించిన వీర్‌శైవ విద్యార్థులు ఈనెల 31వ తేదీలోపు ఆధార్ కార్డు, మార్కుల జాబితా, కులధ్రువీకరణపత్రం లేదా టీసీలను ఎమ్మిగనూరు పట్టణంలో ట్యాంకు బండ్ రోడ్డులో ఉన్న శారదా ఎలక్ట్రీకల్స్‌లో అందజేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

బాల సాహిత్యకారుడికి డాక్టరేట్

ఎమ్మిగనూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్నకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్, ఫ్రెండ్ షిప్ మినిస్ట్రీస్ స్వచ్ఛందసంస్థలు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. పెద్దకడుబూరు మండలం కంబదహాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న గద్వాల సోమన్న అనతికాలంలోనే బాల సాహిత్యంపై 57 పుస్తకాలు రాసి ముద్రించారు. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో ఉన్న అలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రముఖుల సమక్షంలో సోమన్నకు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు.

రూ. 90 వేల ఆర్థిక సాయం

ఎమ్మిగనూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యుడుగా పనిచేస్తూ పక్షవాతానికి గురైన పర్లగ్రామానికి చెందిన కురువ దస్తగిరికి గ్రామీణ వైద్యుల సంఘం రూ. 90వేలు ఆర్థిక సాయం అందించింది. శనివారం సంఘం, విశ్వబ్రహ్మ హెల్త్‌కేర్ సొసైటీ నాయకులు నిర్వాహకులు శ్రీనివాసులు, నాగలాపురం వెంకటేష్, విజయ్, ఈరన్న, నరసింహులులు దస్తగిరిని పరామర్శించి ఆర్థికసాయం అందించారు.